**మూడుముళ్ళు** పడ్డ తరవాత ముచ్చటగా మూడు నెలలు అమ్మ గారింట్లో ఆటున్న పుల్ల ఇటు వేయకుండా మనుగుడుపులు కుడిచిన మంజుల అత్త గారింట్లో అడుగుబెట్టి ఇంకా వారం తిరగలేదు. ఆ కొత్త పెండ్లికూతురు కడపదాటి అడుగు బయటపెట్టలేదు.

ఆయినా ఆమె ఆ ఊరిని గురించి చాలా విషయాలు తెలిసికొంది.

అంటరానితనం అడుగంటి పోవాలని నినాదాలు చేస్తున్నవాళ్ళు — అంటరానివాళ్ళను ఊరికి దూరంగా ఉంచుతున్నట్లే పల్లెలు దేశ సౌభాగ్య సీమలని పలుకుతున్నవాళ్ళు ఆ ఊరిని మాత్రం దాని కర్మకు దానిని వదిలి పెట్టినట్లుంది.

కర్మ సిద్ధాంతం ఈ దేశంలో మూడు పువ్వులూ ఆరు కాయలు గా వర్ధిల్లు తున్నది కాబట్టే నీతి నిజాయితి బ్రదికి బట్ట కడుతున్నాయి. 'సర్దుబాటు తత్త్వం' పోతులూరి వీరబ్రహ్మం తత్త్వంలాగ మనల్ని తత్త్వవేత్తల్ని చేస్తున్నది !— అన్న అభిప్రాయాలతో ఆ పల్లె జల మునక లవుతున్నది.

ఆ పల్లెకు పేటకు మధ్య దూరం మూడు మైళ్ళే.

అయితే పేట ఎదిగిన ఎత్తుతో పోలిస్తే మాత్రం ఆమడల దూరాలు.

పట్టణంనుండి పేట వరకు పరుగులమీద వచ్చే బస్సు—పేటలోనే మొండికేస్తుంది. పల్లె మొగం చూడమంటే— 'నావల్లగాదు బాబూ !' అంటుంది. బస్సుకు బుద్ధి చెప్పలేని పల్లీయుడు పేటనుండి కాలికి బుద్ధి చెబుతాడు.

పేటలో మీట నొక్కితే టకీమని వెలిగే విద్యుద్దీపాలు—పల్లెలోని కిరసనాయిలు బుడ్డీ దీపాల్ని, లాంతర్లని చూసి వగలుపడుతుంటాయి.

పొద్దు గూట్లో పడితే—నీళ్ళు కలిసిన కిరసనాయిలు దీపం నొప్పులు పడుతూంటె పల్లీయుడు నీళ్ళు నములుతుంటాడు.

పల్లెకు పేటకు మధ్యనున్న ఎగుడు దిగుడు రెండెడ్ల బండి బాటను చూసి పేటలో తారు రోడ్లు తొడ తట్టుతుంటాయి. పేటలో వయ్యారంగా పైకి లేచిన మిద్దెలు మేడలు పల్లెలోని పూరి కొంపలను చూసి పకపక నవ్వుతూంటాయి.

ఆ ఊళ్ళో దాదాపు మూడు వందల కడపలున్నాయి.

ఆ ఊరికి నాలుగు దిక్కులున్నాయి.

అయితే పండించింది అమ్మడానికి, కావలసింది కొనుక్కోవడానికి ఆ పల్లెకు పేట ఒకటే దిక్కు.

ఆ ఇంట్లో ఉన్న ముగ్గురికి మూడు దిక్కులు.

అత్త మామ —వాళ్ళ ఒక్కగా నొక్క ముద్దుల కొడుకు తనకు తాళిగట్టిన భర్త. ఆ ఇంటి జనాభా 'ఉడ్డ' కొకటి తక్కువగా ఉంటే తన రాకతో ఆ లోటు తీరింది.

ఒరే నాయనా! ఒక్కగా నొక్క బిడ్డవు. మేమా? బ్రదికినంతకాలం బ్రదకబోయేది లేదు. మనకా? ఒకరి కంత పెట్టి తినగలిగినంత వసతి ఉంది. నువ్వు ఉద్యోగాలు చేసి ఊళ్ళేలింది చాలు బాబూ! మాకండ్ల ముందుర ఉండిపోరా !'' అని కొడుకును చూసి తల్లి బ్రతిమలాడుతుంది.

''అమ్మా! నీ కొక దండం. నీ సలహా కొక దండం. ఊరికి పదివేల దండాలు. ఇలాంటి కొంపలో ఉండడంకంటే హాయిగా అడవిలో కాపురం పెట్టుకోవచ్చు. నా మాట వినండి. ఊఁ ! అనండి. మూడుం ముక్కాలు గడియకు ముక్కాలు దుడ్డుకు ఉన్నది అమ్మిపారేస్తా. ఒక పట్టణంలో అందమయిన ఇల్లు కడతా. తూగుటుయ్యాలమీద మిమ్మల్నిద్దర్నీ కూర్చో బెడతా! మీ కోడల్ని తూగుటుయ్యాల్ని ఊపుతూ కూర్చోమంటా!'' అని వినయంగా సమాధానం చెబుతాడు కొడుకు.

'ఒరే! నే నీ మట్టిమీద పుట్టినాను. ఈ మట్టిలోనే పెరిగినాను. ఈ మట్టితోనే పోరకలాడాను. ని న్నింతవాణ్ణి చేశాను. నువ్వు చదివిన చదువు ఈ ఊరిని ఇంకింత చేస్తుందనుకొంటే— నువ్వేమో వంగినోడికింద వంగాలంటుండావ్ !— పో ! నీ ఖర్మ !—ఒక కన్ను కన్నుగాదు. ఒక కొడుకు కొడుకు కాదు అంటారు. అంతే అనుకుంటూ. ఇంతకాలం నీకోసం, ఇంకమీదట ఈ ఊరికోసం! పోరా పో !' అంటూ పిసరంత ప్రగతి భావోద్రేకి అయిన తండ్రి విరుచుకపడతాడు.

మంజుల మనోహరంగా నవ్వుతుంది.

''ఏమమ్మా కోడలా? నా మాటంటే నీగ్గూడా నవ్వులాటగా ఉందికదా ? అవునులే . ఈ పల్లె కొంపల్లో పడి చావడానికి మీకేం కర్మ పట్టింది. మొగుడు దర్జాగా ఉద్యోగం చేస్తుంటే వంట మనిషి వేళకు అంత వండి పడేస్తే—ఇక ఉండనే ఉండాయి బొచ్చె బోలెడన్ని నవలలు. మీ తోబుట్టువులు రాసి పారేసినవి ... కావలసినంత కాలక్షేపం !'' కాసంత నిష్ఠూరాన్ని రవ్వంత అమాకత్వంతో కలిపి సుతిమెత్తంగా ఎత్తిపొడుస్తున్న మామగారి మాటలకు అరవిరిసిన పువ్వే అవుతుంది మంజుల !

''పిచ్చి మావయ్యా! మీరేదో మీ కొడుకును తీవిగా పాంటు, షర్టు వేసుకోమంటుంటే ఆయన గారేమో అందంగా చీర అలంకరించుకొంటానంటుండాడు. నన్నేం చేయమంటారు చెప్పండి?'' మగని వంక ఆదోరకంగా చూస్తూ మామను అడుగుతుంది మంజుల.

''ఆడ కూతురైనా, అద్భుతంగా చెప్పినావమ్మా!'' అని అంటూ ఇల్లు దద్దరిల్లేలా నవ్వుతాడు మామగారు.

కొరికి తినేద్దామన్నంత కోపంగా చూస్తాడు మొగుడుగారు.

కోడలి దిమాకు చూచి అత్త పెత్తనం మూతి మూడు వంకర్లు తిప్పుతుంది.

''మావయ్యా! మీరు 'ఉ' అనండి. వాళ్ళ అమ్మ, కొడుకు ఒక పార్టీ. మనం మామా కోడళ్ళం— ఒక పార్టీ. ఇదేం కొత్తగాదు. ఒకే ఇంట్లో రెండు మూడు పార్టీలుండడంలో వింతలేదు. ఈ పార్టీ విభేదాలు సిద్ధాంతపరం మీద కాదు. దేశ భక్తితో అనలే కాదు. ఏ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకున్నా తామూ అధికారం చలాయించవచ్చునన్న స్వార్థంతో! పోనీ. చదువుకున్న కోడలిగా మీ పక్కన నిలబడతాను. ఆయన ఉద్యోగం ఆయనగార్ని నిరభ్యంతరంగా వెలిగించుకోనీ! కనీసం ఊరయినా బాగుపడుతుంది'' అని కోడలు ముందు పడుతుంది.

''వద్దు, తల్లీ, వద్దు. కొడుకు కోడలు చిలకా గోరువంకల్లాగా ఉంటే— వాళ్ళను విడదీసినాడని మీ అత్తమ్మే బయలుదేరుతుంది ప్రచారానికి! దాని నోట్లో పడితే ఇక నీపని, నాపని గోవిందో గోవింద!'' అని రెండు చేతులు జోడిస్తాడు మామగారు.

ఆ మామగారి పేరు లక్ష్మీకరం!

అత్తగారి పేరు లక్ష్మీకాంతం!!

కొడుకు పేరు నిరంజనం!!!

అందరు కలిసి ఒక అరగంట సేపు వాదులాడుకొంటారు. అలుపు తీరేలా హాయిగా నవ్వుకొంటారు. ఆ తరవాత ఎవరిగారి వాళ్ళు చూసుకొంటారు.

అత్త లక్ష్మీకాంతమ్మ వంటింటి వైపు బయలుదేరితే, మామ లక్ష్మీకరం ఊరిమీద పడతాడు. ఆ అదను కోసమే కాచుకొని కూర్చున్న నిరంజనం మంజుల మీద పడతాడు. ఆమె పొగరుమోతు తనానికి ప్రతిఫలంగా ముద్దులతో ముంచేస్తాడు.

వాళ్ళ వద్దికను చూసి ఆ పాతకాలం మిద్దెలో చాలా కాలంగా ఉంటున్న పిచ్చుకలు కిచకిచలు పోతాయి. ఆ పిచ్చుకల ఆనందానికి అర్థం గ్రహించిన లక్ష్మీకాంతమ్మ వంటింట్లో ముసిముసిగా నవ్వుకొంటుంది.

ఆ పల్లె చీకట్లో మునిగి తేలుతుంది.

దినం మారుతుంది. పరధ్యానం పాలపడితే లక్ష్మీకాంతమ్మ చేతి వంట రుచి మారుతుంది. పిచ్చుకల కిచకిచల్లో శ్రుతి మారుతుంది. అయితే, వాళ్ళ వాదోపవాదాల్లో మాత్రం మార్పు ఉండదు. విందామంటే ఓర్పు ఉండదు.

అబ్బ మాటలు అబ్బవి!

కొడుకు ధోరణి కొడుకుది!!

తల్లి ఆశలు తల్లివి!!!

అందుకే ఆ ఇంట్లో ఉన్న ముగ్గురివి మూడు దిక్కులు.

తల్లి పిల్లలకోసం ఎదురు చూస్తుంది.

ప్రేయసి ప్రియుడికోసం ఎదురు చూస్తుంది.

చకోరాలు వెన్నెలకోసం ఎదురు చూస్తాయట.

కాని, కాలం మాత్రం ఎవరికోసం ఎదురుచూడదు. ఎదురు చూడడంలో చిరాకు దానికి బాగా వంటపట్టినట్లుంది.

ఒకటి.... రెండు ... మూడు... ఇలా వరసగా రోజులు దొరలి పోతున్నాయి. దినము వాదోపవాదాలు చెలరేగి పోతున్నాయి. వారం తిరిగి పోతుందనుకునేటప్పటికి ఒక రోజు నాలుగు బార్ల పొద్దుండగా వాళ్ళు ఒక నిర్ణయంతో నిలబడ్డారు.

దాని ప్రకారం —

నిరంజనం వెంటనే ఒంటిగా బయలుదేరి వెళ్ళాలి. తాను ఉద్యోగం వెలిగిస్తున్న మహాపట్నంలో ఒక అద్దె ఇల్లు కుదర్చాలి. ఆ ఇంటికి సకల సౌకర్యాలు సమకూర్చాలి. ఆ తరవాత ఒక వారం రోజులు సెలవు

పెట్టి పల్లెకు రావాలి. ప్రయాణానికి ఊరి పురోహితుడు లగ్నం పెట్టాలి. ఆ లగ్నం ప్రకారమే కోడలు కాపురానికి బయలుదేరాలి. కొత్త కోడలు ఇంట్లో అడుగు పెడితే దేనికీ తడుముకోవలసిన అవసరమంటూ ఉండకూడదు.

ఈ షరతులకు నిరంజనం వెంటనే అంగీకరించాడు.

అయితే — 'ఈ నోరులేని వెధవకు ఇల్లు దొరికిన కాలానికి కదా?' అని తండ్రి సంతృప్తి పడ్డాడు.

రుగా తీర్చి దిద్దాలి. ఇవన్నీ జరగాలంటే— మూగవాడు 'అబ్బా!' అన్నంత అదృష్టం. ఆ కాలానికి చూసుకోవచ్చులే! అని తల్లి తలపోసుకొనింది.

కనీసం నెలో రెండు మూడు నెలలైనా కోడలు ఇంట్లో ఉంటుంది. కోడలు ఇంట్లో ఉంటే కొడుకు తలచుట్టి నోటి వద్దకు వచ్చినట్లుగా ఇంటిచుట్టూ తిరుగుతాడు.

ఈ అభిప్రాయం ఆ తల్లిదండ్రుల మనస్సుల్లో ఒకేసారి పొడసూపేసరికి ఇద్దరు విజయగర్వంతో

''అమ్మా! ఇంటిని చూసి ఇల్లాల్ని చూడమన్నారు. ఇల్లు చూశాను. నీ ముద్దుల కోడలు దేనికీ ఇబ్బంది పడని రీతిగా ఇంటిని తీర్చి దిద్దాను. ఆ ఇంటిని చూస్తే ఎవరైనా వెంటనే ఇల్లాల్ని చూడాలంటారు. అలాంటి సమయాల్లో నీ కొడుకు చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. కొడుకు ఇబ్బంది పడడం నీవు చూడలేవు కదమ్మా? అందుకే ఇల్లాలి కోసం వచ్చాను!'' నంగి నంగిగా అన్నాడు నిరంజనం.

వాళ్ళ గుండెల్లో రాయి పడింది.

# గోడలకు నోళ్లు




—పులికంటి కృష్ణారెడ్డి

తండ్రి తనయుడికి నోరే లేదనుకొంటే— తల్లి ఆ నోట్లో నాలుక కూడా లేదనుకొంది.

అందుకే —

నోట్లో నాలుక లేని ఈ బిడ్డ ఆ మహాపట్నంలో వీథులన్నీ తిరగాలి. సందు గొందులు గాలించాలి. ఖాళీగా ఉన్న ఇండ్లను కనుక్కోవాలి. ఇండ్లున్నవాళ్ళు లేని వాళ్ళను వేసే సవాలక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. సమాధానం చెప్పినా—ఆ సమాధానాలు వాళ్ళకు ఒప్పినా ఇల్లు నచ్చాలి. సమాధానం నచ్చితే బాడుగ కుదరాలి. కుదిరినా ఆ ఇంటిని పీడు కుదు

ఒకరినొకరు చూసుకొన్నారు.

ఓడిపోయిన వీరుడిలాగ నిరంజనం తలవాల్చి ఆలోచనలో పడ్డాడు.

మంజుల ఆ ఓడిపోయిన వీరుణ్ణి ఉడికించడానికి విరగబడి నవ్వుతూ ఉంది. కోడలు కుమ్మరిస్తున్న నవ్వుల కుప్పలవంక అత్తమామలు ఆప్యాయంగా చూస్తున్నారు.

ఓడిపోయిన వీరుడు గొంతు సర్దుకున్నాడు.

మూడు రెండ్లు — ఆరు కళ్ళు అమాంతంగా ఆతనిమీద పడ్డాయి.

మంజుల కన్నుల్లో ఆనందం బయట పడడానికి గుంజులాడుకొంటున్నది.

ఓడిపోయినట్లు నటించిన వీరుడు విజయగర్వంతో ఎటో చూస్తున్నట్లుగా వాళ్ళ వైఖరులను గమనిస్తున్నాడు.

లక్ష్మీకాంతమ్మ, లక్ష్మీకరం ఒకరి మొగం ఒకరు చూసుకున్నారు. చూసుకొంటూ ఒక్కసారిగా రెండున్నర దశాబ్దాలకు వెనక్కు వెళ్ళారు. చిత్రమైన అనుభూతి వాళ్ళని చిందర వందర చేసింది. మొగాల్లో సిగ్గు పెగ్గ నిగ్గుదేలింది. అక్కడ ఒక క్షణం నిలబడ

లేక పైటచెరగు నోటి కడ్డంగా పెట్టుకొని లక్ష్మీకాంతమ్మ వంటింటివైపు ఉడాయిస్తే—లక్ష్మీకరం ఊరివీాద పడ్డాడు.

నిరంజనం మంజులని ఒక పూలబంతిలా జవురుకొన్నాడు.

"అబ్బబ్బ! వేళాపాళా యేవీలేదు. వదలండి, బాబూ!" అని అంటూనే తప్పించుకోవడానికి తనప పడుతున్నట్లే రెండు చేతులతో అతని మెడను వాటంగా వాటేసుకొంది. ఒక లావుపాటి పూహారాలను రెండు చేతులతో మోస్తున్నట్లే ఆమెను ఎత్తుకొని పడకటింటివైపు పరుగుదీశాడు నిరంజనం. మెత్తటి పరుపుమీాద ఆమెను అలా మెల్లిగా జారవిడిచాడు.

కమిలిన ఎడమ చెంపను కుడిచేత్తో తడిమి చూసుకొంటున్నాడు.

మంజుల కొంటెగా అతనివైపు చూస్తూ ఉంది.

ఉన్నట్టుండి పిచ్చుకలు కిచకిచమని గోలచేశాయి.

నోటికడ్డంగా పెట్టుకొన్న పైట చెరగును లక్ష్మీకాంతమ్మ నోట్లో దురుక్కొనింది.

పొద్దు గూట్లో పడింది.

చీకటి ఆ పల్లెను ఆప్యాయంగా తన కౌగిట్లోకి తీసుకొనింది. ఆ పల్లెను చీకటి కౌగిటినుండి విడదీయడానికి కిరసనాయిలు బుడ్డీ దీపాలు.... లాంతర్లు సతమతమవుతున్నాయి.

నిరంజనం కౌగిట్లో మంజుల మనస్సు వెచ్చనవుతూ ఉంది.

లక్ష్మీకాంతమ్మ పొయ్యిముందు కూర్చునికట్టెల్ని ఎగదోస్తూ ఉంది— వంట తొందరగా ముగించడానికి! పొయ్యి వెలుగుతో ఆమె ఆనందం పోటీ పడుతూ ఉంది.

ఊరి పురోహితుడు గుప్పు గుప్పు మంటువున్న లాంతరు ముందర కూర్చుని బుర్ర గోక్కొంటు టున్నాడు, ప్రయాణానికి లగ్నం కట్టడానికి. లక్ష్మీకరం ఆతడి ముందు గురువు ముందర శిష్యుడిలాగ బుద్ధిగా కూర్చున్నాడు.

ఎవరి పనుల్లో వాళ్ళుంటే— తానేమీా తక్కువ కాదన్నట్లు కాలం తనపనివీాద తానున్నది!

మూడు రోజుల తరవాత పట మెరుగుతున్న వేళలో ప్రయాణానికి లగ్నం!

ఆరోజు. ఇంటి ముందు రెండెడ్ల బండిని నిలబెట్టాడు కన్నిగాడు. వాడా ఇంటి సేద్యగాడు. బండి మీాద వరి కసవు పరిచాడు. పెట్టె ఆ కసవు మీాద గోనె పట్టాలు... ఆ పట్టాల మీాద చలువచేసిన దుప్పట్లు పరిచాడు. పెట్టె బేడా దారాలువేసి బిగించి కట్టాడు. మంజులా, నిరంజనం ఇంటినుండి బయలుదేరితే వాళ్ళను వీధి వాకిట్లోనే నిలబెట్టి లక్ష్మీకాంతమ్మ గచ్చకాయంత కర్పూరంవెలిగించి దిష్టితీసింది.

వాళ్ళు బండెక్కి కూర్చున్నారు.

కన్నిగాడు ఎద్దుల్ని నిలబెట్టి కాడిగట్టాడు.

లక్ష్మీకాంతమ్మ కాసంత దూరం వెళ్ళి ఎదురుగా వస్తుంటె బండి బయలుదేరింది.

కరకర పొద్దు మొలుస్తూ ఉంది.

కావి రంగుతో తూర్పు దిశ మిల మిల మెరిసిపోతూ ఉంది.

చెట్ల ఆకుల మాటున ఆ రాత్రంతా తలదాచుకొన్న గువ్వా గత్రా కలకల నినాదాలతో బిలబిల పైకి లేస్తున్నాయి.

ఎగుడు దిగుడు బండి బాటమీాద రెండెడ్లబండి ఎగిరెగిరి పడుతూ ముందుకు సాగుతూ ఉంది.

మంజుల పుట్టింది పట్టణంలో. చదివింది కాలేజీల్లో. తిరిగింది ఆటోల్లో, కార్లలో ఎగుడు దిగుడు బండి బాటమీాద ఎత్తెత్తి వేస్తున్న బండి ప్రయాణం ఆమెకు ఒక కొత్త అనుభవం.

ఒక చక్రం పల్లంలో దిగితే, మరో చక్రం మిట్ట మీాద ఉంటుంది. బండి పల్లం వైపు వాలుతుంది. అప్పుడు ప్రక్కకు వాలి పడిపోతామేమో? అన్న భయంతో ఆమె రెండు చేతులు చాస్తుంది. ఆ కుదుపులో ఎంత నిలదొక్కుకున్నా వీలుపడక, నిరంజనం ఆమె మీాద వాలపడతాడు. ఒకరి చేతుల్లో ఒకరు! ఒకరి మీాద ఒకరు!! కిలకిలా నవ్వుకొంటారు.

'సేద్యగాడు చూస్తున్నాడే!' అన్న సిగ్గునుండి తేరుకొని సర్దుకొని కూర్చుందామని ప్రయత్నించే లోపుగానే ఇంకొక చక్రం పల్లంలోకి దిగుతుంది. బండి అటువైపు వాలుతుంది. నిరంజనం చేతులు చాస్తూ ముందుకు వాలుతాడు. తన కోసమే అన్నట్లుగా ఆమె అప్పటికే అతనిమీాద పడుతుంది. మళ్ళీ ఒకరి మీాద ఒకరు! ఒకరి కౌగిట్లో ఇంకొకరు!!

చిత్రమైన అనుభూతితో ఇద్దరు చిత్తయిపోతున్నారు.

కన్నిగాడు గమనించీ గమనించనట్లే ఒక కంట గమనిస్తూ ఎద్దుల్ని అదిలించి కొడుతున్నాడు. ఆ జోరులో ఏమాత్రం మిట్ట పల్లాలున్నా బండి కుదిలించి పారేస్తూ ఉంది. ఆ కుదుపులతో వాళ్ళు ఒకరి మీాద ఒకరు పడుతున్నారు. పులకరింతల్లో తేలిపోతున్నారు. ఆ ఆనందంలో వాళ్ళకు దారి గడిచినట్లే తెలియడం లేదు.

బండి పేట చేరుకొనింది.

మంజుల, నిరంజన్ బండి దిగారు.

బస్ స్టాండ్‌లో ఒక చింత చెట్టు. చింతచెట్టు నీడలో ఒక పూరి గుడిసె. గుడిసెలో ఒక టీకొట్టు. ఆ టీ కొట్టుకు నాలుగు బారల దూరంలో ఒక పాఠశాల. అది మాధ్యమిక పాఠశాల. ఆ పాఠశాల్లోనే నిరంజనం ప్రాథమిక విద్య జరిగింది. అప్పటినుండి చూస్తూనే ఉన్నాడు. ఆ టీ కొట్టు ఎదుగు బొదుగూ లేకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. ఆ టీ కొట్టు ఆసామి—అయ్యాసామి—మాత్రం వయసు ప్రభావంతో మనిషి గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు. అయితే, నిరంజనాన్ని చూస్తూనే ఆప్యాయంగా పలకరిస్తూ—'ఈ పొద్దు బస్సులు బందుగద, నాయనా!' అన్నాడు.


సాహితీ రంగంలో గత పదేళ్లుగా పాఠకులను తమ రచనలతో ఆనందపరవశుల్ని చేస్తున్న..

శ్రీమతి ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి రచనలు

| | | | |
|---|---|---|---|
| చెట్టూ-ఛాయ .. 6.00 | బృందావనం ... 7.50 | ధర్మచక్రం .... 10.00 | జనరంజని .... 12.00 |
| విద్య ........ 6.00 | దివ్యదీపావళి .. 7.50 | చక్రవాకం .... 10.00 | తీయని శాపం .. 6.00 |
| సత్యం శివం సుందరం 10.00 | కల్పవృక్షం .... 6.00 | కళ్యాణమందిర్ .. 7.50 | అనిర్వచనీయం . 6.00 |
| శిలలు-శిల్పాలు ... 10.00 | దిక్చక్రం ..... 6.00 | ప్రేమనగర్ .... 7.50 | [illegible] .... 6.00 |
| పూజారిణి ..... 12.00 | చక్రనేమి .... 12.00 | చక్రభ్రమణం .. 7.50 | సుప్రభాతం .... 6.00 |
| సూర్యముఖి .... 10.00 | శంఖుతీర్థం ... 12.00 | [illegible] ...... 6.00 | [illegible] .... త్వరలో |
| కల్పన ........ 6.00 | శాంతినికేతన్ ... 12.00 | సంసారచక్రం .. 7.50 | ఉషస్సు .... త్వరలో |
| నందనవనం .... 12.00 | భాగ్యచక్రం ... 10.00 | పెళ్లి ఎవరికి! ... 6.00 | |

మీ దగ్గరి బుక్ షాపుల్లోనైనా కొనండి. లేదా పుస్తకాల ఖరీదులో 1 రూపాయి తగ్గించి M.O పంపితే ఆ రూపాయికి వి.పి పోస్టులో పంపగలము.

నవజ్యోతి పబ్లికేషన్స్ ఏలూరురోడ్. విజయవాడ-2

ఒక్క క్షణం నివ్వెర పడ్డాడు నిరంజనం.

ఆ తర వాత—'నిజమా?' అని సందేహంగా అడిగాడు.

"అయ్యో రావా! నీతో అపద్దం సెప్పాలని నా కేమన్నా గాచ్చారమా? తెల్లార జావున నాలుగెంట్ల బస్సురాలా! ఆరుగెంట్ల బస్సుకూడా రాలా! డ్రైవర్లేవో స్ట్రయిక్ చేసినారంట!"

ఎడమ చేతిని మోకాలి క్రిందికి దించి కుడి చేతిని తలపైకెత్తి వయ్యారంగా వంగి టీని ఒక గ్లాసులోనుండి మరో గ్లాసులోనికి పోస్తూ తనలో తాను అనుకొంటున్నట్లే అన్నాడు అయ్యాసామి.

నిరంజనం గొంతు తడారింది.

తడారిన గొంతును అయ్యాస్వామి ఆప్యాయంగా అందించిన టీతో తడుపుకొన్నాడు. ఆ మాటల్ని వింటున్న కన్నిగాడు తలగుడ్డ విప్పి తల గోక్కుంటూ న్నాడు. మరో ఆలోచన వాడి బుల్లి బుర్రకు తట్టక పోయేసరికి దేబెరించి చూస్తూ నిలబడ్డాడు.

"అలా చూస్తా నిలబడ్డా వెందుకురా, కన్నయ్యా! బండిగట్టు. పోదాం!" అన్నాడు నిరంజనం.

ఎగిరి గంతేసినాడు కన్నిగాడు. బండి ఇంటిముఖం పట్టింది..

అదే బండి... అవే బండిబాట... అవే చెట్టు సల్లాలు... అదే కుదుపులు... అవే అనుభూతులు— అయితే, నునుపటి ఆనందాన్ని వాళ్ళు పేటలోనే మూటగట్టి వదలిపెట్టి నట్లుంది. చాలా తీవ్ర మైన వాదోపవాదాల్లో పడ్డారు.

"ఎందుకండీ అంత తీవ్రంగా ఆలోచిస్తారు. ఎవరి హక్కులు వాళ్ళవి. హక్కులు సానుకూల పరిష్కారానికి రాకపోతే— సాధించుకోవడానికి ప్రయత్నాలు అవసరం. ఆ ప్రయత్నాల చివరి మెట్టు సమ్మె!" తీవ్రంగా ఆలోచిస్తున్న నిరంజనాన్ని సమాధాన పరచవలెనని ప్రయత్నించింది మంజుల.

"మంజూ! ఈ దేశంలో పుట్టిన ప్రతి మనిషి మనిషిగా జీవించడానికి హక్కు ఉంది. అయితే ఎంతమంది మనుష్యులు మనుష్యులుగా జీవించగలుగుతున్నారు. అదో అటు చూడు. ఆ కట్టెల మోపును మోసు కొనిపోతున్న మనిషిని గమనించు. పేట ఇక్కడికి రెండు మైళ్ళ దూరం ఉంటుంది గదా? ఇక్కడి నుండి అవలిపో మరో రెండు మైళ్ళు వెళ్ళితేకానీ — కట్టెలు పోగు చేసుకోలేడు కదా? అంటే— ఏ తొలి కోడి కూసే వేళకో నిద్ర లేస్తే కానీ— ఆతడు కట్టెలు కొట్టి మోపు కట్టు కొని ఈ వేళకు తిరుగు ముఖం పట్టలేడు. ఇక పేటకు మోసుకొని వెళ్ళాలి. దింపమన్న చోట మోపు దించాలి. బేరమాడాలి. కుదరక పోతే మళ్ళీ నెత్తికెత్తుకోవాలి ఇంత కష్టపడితే ఆతడికి దక్కేది ఒక నాలుగయిదు రూపాయలు. దాంతో వాడు కుటుంబాన్ని పోషించాలి! బట్ట నలక్కుండా పంకా కింద కుర్చీలో కూర్చొని నాలుగు కాగితాలు పొర్లిస్తే ఒక దినానికే ఇంతకు పదింతలు గిట్టుతూ ఉంది. వాడి హక్కును ఎవరు కాపాడాలి? ఎలా కాపాడాలి?" — చెమటలు కారుస్తూ కట్టెలు మోసుకొని పోతున్న వాడివైపు తదేకంగా చూస్తూ అడుగుతున్నాడు నిరంజనం.

"మీరు చెప్పేది బలే బాగుందే! మీది మేధా సంపత్తి. వాడిది శారీరక శక్తి. ఒక దానితో ఒకటి పోల్చడానికే వీలులేని పరిస్థితి!" చాలా తెలివిగా మాట్లాడినట్లు కిలకిలా నవ్వింది మంజుల.

"వాడూ మనిషే!— వాడికీ మేధ ఉంది. అయితే ఆ మేధా సంపత్తి పెరగనీక పోవడానికి కారణం ఎవరంటావ్?"

"వాడి ఖర్మ!"

"బాగా చెప్పావు, మంజూ! ఈ భారతదేశంలో పుట్టిన ఆడపడుచుని—ఈ మాత్రం కర్మసిద్ధాంతం ఒంట పట్టకపోతే — నీలాంటి వాళ్ళను చూచి దేశమాత విలపిస్తుంది. పోనీ నీ మాటకే వస్తాను. బస్సు నడిపే డ్రైవరుకి కావలసిందేమి?"

"ఒక విధంగా ఆలోచిస్తే వాళ్ళదీ శారీరక మైన శ్రమే!"

"మరి కట్టెలు కొట్టుకొని బ్రదుకుతున్న వాడిది శారీరకమైన శ్రమ. బస్సు నడుపుతున్న వాడిది శారీరకమైన శ్రమ. ఇంతెందుకు?— ఈ బండి తోలుతున్న కన్నయ్యది శారీరకమైన శ్రమ. అయితే కన్నయ్య సమ్మె చేయలేదు. కట్టెలమ్ముకొనేవాడు సమ్మె చేయలేడు. బస్సు నడిపేవాళ్ళు మాత్రం సమ్మె చేయ గలుగు తున్నారు."

మంజుల శ్రద్ధగా వింటూ ఆలోచిస్తున్నది.

బండి తోలుతున్న కన్నగాడి కీ భాగోతం చెవి కెక్కలేదు.

"మంజూ! ఈ దేశ సంపదను ఎవరో కొళ్ళ గొట్టుకొని పోతున్నారని మధన పడి ఈ దేశ సంపదను ఈ దేశ వాసులకే పంచిపెట్టాలని మహాత్ములు స్వాతంత్ర్యాన్ని సాధించారు. మనల్ని మనల్నిగా బ్రదకమన్నారు. కానీ నోరున్న వాళ్ళదే

**ఆస్ప్రో రెట్టింపు వేగంతో బాధ నివారిస్తుంది**
**నిజం, రెట్టింపు వేగంగా!**



ఇతర సాధారణ బాధానివారణ మాత్రలకంటే రెట్టింపు వేగంగా పనిచేస్తుంది.
ప్రతి ఆస్ప్రో మాత్రలోని ఔషధ విశేషం మైక్రోఫైన్ చేయబడింది. ఇది ఇతర సాధారణ మాత్రలకంటే 30 రెట్లు ఎక్కువగా చూర్ణం చేయబడిన సన్నని అణువులతో తయారు చేయబడుతోంది. అందుకని అది మీ శరీరంలో రెట్టించిన వేగంతో కలిసి పని చేస్తోంది. తలనొప్పి, ఒళ్ళునొప్పులు, పంటి నొప్పులు, జలుబు మరియు ఫ్లూ మొదలైన వాటిని రెట్టించిన వేగంతో నివారిస్తుంది.

పెద్దవారికి మోతాదు : 2 మాత్రలు.

**మైక్రోఫైన్డ్**
**ఆస్ప్రో**
Nicholas



**ఎందుకంటే**
**ఆస్ప్రో ఒక్కటే మైక్రోఫైన్డ్ చేయబడింది.**

Sista's-NIA-392/80 TL

రాజ్యంగా ఉంది. ఒకప్పుడు ఎవడో విదేశీయుడు మన నోళ్ళు* గొడుతున్నాడని బాధ పడ్డాం. మన సౌఖ్యాల్ని దోచేస్తున్నాడని విలపించాం. ఇప్పుడు మనలో మనమే — అంటే, నోరున్న వాళ్ళు నోరులేని వాళ్ళను దోచుక తింటున్నారు. ఈ సమ్మెల పరమార్థం ఇదేనేమో? — అని పిస్తుంది."

అంతలో ఊరు వచ్చింది.

కన్నిగాడు ఇంటి ముందు బండి నిలిపాడు.

బండి ఇంటి ముందాగిన శబ్దం చెవిని పడడంతో ఆదరా బాదరా వీథి వాకిట్లోకి వచ్చిన లక్ష్మీకాంతమ్మ కొడుకును కోడల్ని, చూసి ఒక క్షణం అలానే నిలబడి పోయింది. అంతలోనే ఏదో మతికి తెచ్చుకొన్నట్లు గబగబ ఇంట్లోకి వెళ్ళింది. వెళ్ళినంత హడావిడిగా తిరిగి వచ్చింది, ఎర్ర నీళ్ళ తట్టతో! ఇంట్లో అడుగు పెట్టపోతున్న ఇద్దర్ని అక్కడికక్కడే ఆపి ఎర్ర నీళ్ళు దిగదీసి పోసింది.

వాకిట్లో నిలబడిన మంజుల, నిరంజనం ఒకరి వైపు చూచుకొన్నారు దొంగా! నవ్వుకొన్నారు దొరగా! ఆటుపై ఇంట్లోకి అడుగుపెట్టారు. లక్ష్మీకాంతమ్మ వాళ్ళను వెంబడించింది. కన్నిగాడు ఎద్దుల గాటకట్టి బండిలోని సామాన్లని దింపడంలో నిమగ్నుడయ్యాడు.

"పేట నుండి బస్సులు నడవడం లేదమ్మా! డ్రైవర్లేదో సమ్మె చేశారంట!" తిరిగి వచ్చిన దానికి కారణం చెబుతున్నట్లుగా తల్లితో అంటూ తాతలనాటి పట్టెమంచం మీద కూర్చున్నాడు నిరంజనం. మంజుల లోనికి వెళ్ళింది.

"పీడా విరగడయ్యింది. పోనీలే నాయనా! ఇప్పుడు పుట్టి మునిగిపోయిం దేముందని!" నెత్తి బరువు నేలపడ్డంత హాయిగా అనింది లక్ష్మీకాంతమ్మ.

ఈ సాకుతో నైనా కొడుకు కోడలు ఒక నాలుగు రోజులు ఇంటి పట్టున ఉంటారన్నది ఆమె ఆశ.

కానీ, ఆ మరునటిరోజే ప్రయాణం కట్టాడు నిరంజనం!

"నాయనా! కోడల్ని తీసుకొని కొత్త కాపురానికి వెళ్ళుతున్నావు. ఎప్పుడు పడితే అప్పుడు బయలుదేరితే ఎలా? రెండు రోజులు ఓపిక పట్టు. ఈసారి పురోహితుడు దగ్గరికి నేమా వెడతా! మంచి లగ్నం పెట్టించుకొస్తాం!"

అడ్డుపుల్ల వేసింది తల్లి!

"అమ్మా! నిన్న మీ మాట కాదనలేదు. పురోహితుడు పెట్టిన లగ్నాన్ని ధిక్కరించలేదు. గచ్చకాయంత కర్పూరం వెలిగించి దిష్టి కూడా తీశారు. స్వయంగా మీరే ముత్తైదువ శకునం! అయితే ఏమయింది? ఇంటికి తిరిగి రావలసి వచ్చింది. దీన్ని కూడా మీ రేమంటారు? అంతా మన మంచికే జరిగిందంటారు. కాబట్టి మీరేమీ అడ్డు చెప్పకండి" అన్నాడు నిరంజనం.

తల్లి మారు పలకలేదు.


కన్నిగాడు బండికట్టాడు.

మంజుల, నిరంజనం బండి ఎక్కారు. బండి బయలుదేరింది.

"ఏమండీ! దేశాన్ని గురించి దేశ కాల పరిస్థితుల్ని గురించీ ఏదో ఒక రకమైన అభిప్రాయం ఉంది గదా! ఈ మాట మూలంగా మీరు పుట్టి పెరిగిన పల్లె మాటు మణిగి ఉంది కదా! మీరు ఒకరి మీద ఆధారపడవలసిన అవసరం లేని వసతి ఉంది గదా? మరి మీరెందుకీ ఉద్యోగం చేయడం?"

బండి ఊరి పొలిమేరలు దాటి జట్టు వాని ఒడ్డు దాటి ముగ్గు రాళ్ళ వంక దగ్గర పోతూంటే మంజుల అడిగింది.

"ఇది నీకు రావలసిన సందేహమే, మంజూ! అయితే, ఈ రోజుల్లో మేధస్సుకు గౌరవం నశించింది. ముఖ్యంగా ఇలాంటి పల్లెల్లో వితండ




వాదాలు ఎక్కువైనాయి. 'ఒకడు చెప్పడమేమిటి? మనం వినడమేమిటి?' అన్న తత్త్వం ప్రబలి పోయింది. ఏదైనా సదుద్దేశంతో గ్రామాభివృద్ధి కోసం యత్నిస్తే — ఆ ప్రయత్నం విఘ్నేశ్వరుని చేయబోతే కోతి తయారైనట్టవుతుంది."

"ఈ రోజుల్లో ప్రతి వ్యక్తి అలానే అంటున్నారు. మీరూ అంతే అంటుంటారు!"

"పొరుగు వాడికి తోడు పడపోతే పీడపొయ్యింది కానీ, పొరుగు నెత్తిన చేత్త వేయకుండా ఉంటే-వాడు దేశభక్తుడు. తన బ్రదుకు తను బ్రదికితే మహాదేశభక్తుడు. అందుకే నేను గుట్టుగా మట్టుగా నా మట్టుకు నేను బ్రదక తలచుకొన్నాను."

వాళ్ళ మాటల్లో వాళ్ళు పడి లేస్తున్నారు. బండి ఎగుడు దిగుళ్ళలో పడి లేస్తూ ఉంది. అంతలో పేట వచ్చింది. కాదు—బండి పేట చేరుకొనింది.

టీ కొట్టుకు నాలుగు బార్ల దూరంలో బండి, కంట పడగానే టీ కొట్టు ఆ సామి అయ్యాసామీ— 'నాయనా! ఈ పొద్దుగూడ బస్సులు నడవడం లేదు. కండక్టర్లు కూడా స్ట్రైక్ చేసినారంట. డ్యూటీ కొచ్చిన డ్రయివరు డిపో సుందర తిరగలాడతా ఉండారంట! ఇట్టుంటే ఇక బతికి బట్టకట్టినట్టే?' అని యాష్టపోయాడు టీ ఆర్పుతూ.

మారు మాట్లాడకుండా బండి వెనక్కు తిప్పాడు కన్నిగాడు.

ఎగుడు దిగుడు బండి బాటలో బండి ఎత్తి ఎత్తి వేసినట్లుంది. దేశ కాల పరిస్థితుల్ని తలచుకొంటుంటే కడుపులో చేయి పెట్టి దేవినట్లుంది. కుదురుగా కూర్చోలేకపోతున్నాడు నిరంజనం. కొత్త పెండ్లి కూతురు మంజుల ఆనందానికి హద్దులు వెదకవలసిన సమయం. కోరికల మత్తులో కొంకర్లు పోవలసిన తరుణం. ప్రతి దినము ప్రయాణం భిన్నం కావడాన్ని గురించి పలుపలు విధాలుగా తలపోసుకొంటూంది.

మిన్ను విరిగి మీద పడవచ్చు. దానిని గురించి ఆలోచించలేడు సామాన్యుడు. కన్నిగాడు సామాన్యుడు. వాడి పని వాడిది. అందుకే బండి జాగ్రత్తగా ఇల్లు చేరింది.

కొడుకు, కోడలు తిరిగి ఇంటికి వచ్చారన్న సంతోషం కంటే — లక్ష్మీకాంతమ్మ బస్సులు నడుస్తున్న తీరు తెన్నుల్ని విని బుస్సు మనింది.

లక్ష్మీకరం కొడుకుతో అన్న మాటల్ని విని బెట్టుకొన్నాడు. ఎప్పుడు ఇంటికి వస్తున్నాడో, ఏమో?— ఎప్పుడంత ఎంగిలి పడుతున్నాడో ఏమో? ఊరి మీద తిరుగుతున్నాడు, దానిని బాగు చేద్దామని. కొడుకు రావడాన్ని గురించి కానీ, పోవడాన్ని గురించి కానీ అతడంతగా పట్టించుకోలేదు.

ఆ మరునటి రోజు ఉదయం మళ్ళీ ప్రయాణ సన్నాహాలు!

"నాయనా! బయలుదేరిన వేళా విశేషం ఏమిటో కానీ, దినమూ వెళ్ళడం తిరిగి రావడంగా ఉంది. రెండు రోజులు నిదానించరాదా?" తల్లి గొణిగింది.

"నువ్వేమీ అడ్డు చెప్పకమ్మా!" కొడుకు కోపగించుకొన్నాడు.

అడ్డు చెప్పలేదా మహాతల్లి.

బండి బయలుదేరింది. పోటమరిస్తున్న పొద్దుతో పోటీ పడగల సౌందర్యం పక్కనుంటే పరవశించి పోవలసిన తరుణం. కానీ నిరంజనం దృష్టి అందుకోవలసిన బస్సు మీద — ఆ మరునాడు చేయవలసిన 'డ్యూటీ' మీద లగ్నమయింది. ఆ ఊళ్ళో అమ్మలక్కలు రోజు తిరుగు ముఖం పడుతున్న తమ ప్రయాణం మీద విసిరినవిసుర్లు మనస్సులో తెర్లుతూ ఉంటే మంజుల ఆలోచిస్తూ ఉంది.

బండి టీ కొట్టును సమీపించింది.

బండి రాకను గమనించిన అయ్యాసామి అదో రకంగా నవ్వాడు.

నిరంజనం గుండెలో నిజంగానే రాయి పడింది.

"నాయనా! మెకానిక్ స్ట్రైకు ఈ పొద్దు మొదలయించిందంట. బస్సుల్ని డిపో నుండి బయటికెత్తనీయడం లేదంట! దానెమ్మను గొట్ట! నా బేరం కూడా సగానికి సగం పడి పోయింది."

నిలువునా కంపించి పోయాడు నిరంజనం.

ఈ దేశంలో ఇలా మాటి మాటికి 'సమ్మె! సమ్మె!' అనే వాళ్ళనంతా టీ కొట్టు పక్కన చింతచెట్టు కొమ్మలకు అక్కడే ఉన్న చేదబావి చేంతాడు వేసి వ్రేలాడ దీద్దామన్నంత కోపంవచ్చింది. కానీ, ఆ చింత కొమ్మలు నిలువవు. చేంతాడు చాలదని ఆలోచించలేకపోయాడు.

టీ బాయిలర్‌లోని చింత నిప్పుల్లా మండుతున్నాయి ఆతని కండ్లు.

అయ్యగార్ని ఆ రూపంలో ఎప్పుడూ చూడని కన్నిగాడు కలవర పడి పోతున్నాడు.

"ఏ పరిస్థితుల్లోనైనా నేను రేపు డ్యూటీకి పోక తప్పదు. ఇంతవరకు ఒక పద్ధతిమీద నడిచింది నా ఉద్యోగ జీవితం. ఇప్పుడనవసరంగా మాట పడడం నావల్లగాదు. ఇప్పుడు వెళ్ళాలంటే రైలొకటే శరణ్యం!" మంజుల నుద్దేశించి అన్నాడు నిరంజనం.

'బస్సయితే యేమి?... రైలయితే యేమి?— వెళ్ళడమేగా ప్రధానం! రైల్లోనే వెడదాం!' అప్పటికాపేటలో ఒక రైల్వే స్టేషన్ ఉన్నంత ధీమాగా పలికింది మంజుల.

"అది గాదు, మంజూ! ఇక్కడికి రైల్వే స్టేషన్ దాదాపు పదిహేను మైళ్ళ దూరానికి పైగా ఉంది. మనం ఈ బండిమీద అక్కడికి చేరేటప్పటికి ఆ బండి వెళ్ళిపోతుంది. ఆ మార్గంలో అదొక్కటే బండి!"

"అందుకని ఏం చేయాలంటారు?"

'మీరు వచ్చినదారి పట్టి ఇల్లు చేరండి. నేను ఆరు మైళ్ళు అడ్డదారిని పట్టి రైలందుకొంటాను.'

మంజుల మొగం సెగకు వడలిన పువ్వులా తయారయింది.

"చూడు, మంజూ! నిన్ను వదిలి నేను మాత్రం ఎలా ఉండగలను? కనీ పెంచిన అమ్మ నాన్న మాటల్ని కూడా లెక్కచేయకుండా నిన్ను వెంట బెట్టుకొని బయలుదేరానుకదా? ఎదురు చూడని పరిస్థితులు ఎదురైనపుడేం చేయాలి? వారం తిరుగక ముందే!" మాటల్లో లాలింపు. చూపుల్లో కవ్వింపు.

మంజుల మారు మాట్లాడలేకపోయింది.

ఇద్దరి దారులు వేరైనాయి. వేరైనదారులు మీద ఇద్దరూ బయలుదేరారు. కానీ కనుచూపు ఆనినంతమేరకు ఆ నాలుగు కండ్లకు మరొకటి కంట పడలేదు.

రెండెడ్ల బండి కుదుపు కుదుపులో నిరంజనం మనసులో మెదలుతూంటే— ఏదో అనుభూతి.... ఆతని పరిస్థితికి సానుభూతి... వారం రోజులు ఎలా గడుస్తాయో?— అన్న భీతి— మంజుల ఇల్లు చేరింది.

కర్తవ్యం ముందుకు లాగుతూ ఉంది. ఆప్యాయతా అనురాగం వెనక్కు ఈడుస్తున్నాయి. అడుగు దీసి అడుగు వేయడంలో కాళ్ళు తడబడుతున్నాయి. ఆరు మైళ్ళు నడిచే సరికి నిరంజనానికి ఆరో ప్రాణం చేతికి వచ్చినంత పనయింది.


# ఉమేష్ యోగ దర్శన్

(రెండవ భాగం)
గ్రంథకర్త : యోగిరాజ్ శ్రీ ఉమేష్ చంద్రజీ
ఇంగ్లీషు లేదా హిందీ ప్రతి ధర : రు. 30/-
పోస్టేజి : రు. 5/- అదనం.
ఇది యోగం పైన బ్రహ్మాండమైన వ్యాఖ్యానం. దీనిలో ప్రాణాయామం, విరక్తత, మనస్సు కేంద్రీకరణ, ధ్యానం. సమాధిలోని వేర్వేరు దశలు, సరియైన చిత్రాలతో, సుగమంగా ఉండేతీరులో రాయబడినది. గ్రంథకర్త యొక్క స్వానుభవంపై ఆధారపడిన యీ పుస్తకం, మీలో కుండలిని ఏ రకంగా జాగృతం చెయ్యాలో బోధపరుస్తుంది.

శ్రీ రామ్‌తీర్థ్ యోగాశ్రమ్
Tel.(II) దాదర్ (సెంట్రల్ రైల్వే), బొంబాయి 400 014. ఫోన్ : 442899.



అయినా రైల్వే స్టేషనులో ఆగి ఉన్న రైలు కంట పడేసరికి అతనికి ప్రాణం లేచి వచ్చినట్లని పించింది. ఆదరా బాదరా టిక్కెట్టుకోసం వెళ్ళాడు.

"రైలు వెళ్ళడం లేదండీ!" అన్నాడు నింపాదిగా స్టేషను మాస్టరు.

"ఎందుకూ?" అని ఆశ్చర్యంతడిగాడు నిరంజనం.

"ఏదో యాక్సిడెంటన్న గలాటా! ఎక్కడి బండ్లక్కడ నిలిపేశారు. ఎప్పుడు బయలుదేరుతాయో? ఏమో?" ఎన్నెన్ని ముందికి ఏంతెంత వివరంగా చెప్పాడో? ఏమో? ఆ రెండు మాటలనడానికే విసుక్కొన్నాడు స్టేషన్ మాస్టర్.

అడిగిన వాళ్ళందరికీ చెప్పిందే చెప్పి స్టేషను మాస్టరుకు విసుగు. ఆరు మైళ్ళు కాలికి కాలు కొట్టుకుంటూ నడిచి నిరంజనానికి విసుగు!

ఓపిక నైదొలగింది.

అయినా కూడగట్టుకొని అక్కడికి అరమైలు దూరంలో ఉన్న ఒక రహదారి మీద నిలబడ్డాడు నిరంజనం!

ఒక నాలుగైదు లారీలు అతడు అడ్డం పెట్టిన చేతిని అడ్డమనుకోకుండా వెళ్ళిపోతే, కడకు ఒక లారీ డ్రైవరు అడ్డమనుకొని ఆగాడు. ఆ అడ్డం అతడి కవసరం!

ఆ లారీ డ్రైవర్ అడిగినంత నిరంజనం ఇచ్చాడు. నిరంజనాన్ని డ్రైవరు తన పక్కనే కూర్చోబెట్టు కొన్నాడు.

'బతుకు జీవుడా!' అని నిరంజనం చేరవలసిన చోటు చేరాడు— ఏ తెల్లవారు జాములోనో!

ఆరేడు మైళ్ళు నడక... రాత్రంతా నిద్ర లేకుండా లారీ ప్రయాణం... బాగా అలసిపోయాడు మనిషి. అలాపడుకొన్నాడో, లేదో — నిద్ర ముంచు కొచ్చింది.

ఉదయం తొమ్మిది గంటలయింది. కిటికీ సందుల్లో నుండి సూర్యరశ్మి చురక అంటించే సరికి ఎగిరి పడి లేచాడు నిరంజనం. అతడు నిద్రలేవగానే కంట పడింది దినపత్రిక. అతడు ఆదమరచిన నిద్రలో ఉన్నపు డది తలుపు సందుల్లోనుండి లోని దూరింది. ఆ పత్రిక మొదటి పేజీ కనుపించింది చూచి కలవర పడ్డాడు. అరికాని కురుబొమ ముడి పడింది. 'ఛీ!' అంటూ నేల విసిరి కొట్టాడా పత్రి కను. అది అటుపడి ఇటుపడి కడకు మొదటి పేజీ పతాక శీర్షికను ప్రస్ఫుటంగా చూపుతూ ఉంది.

"నేడే దేశవ్యాప్తంగా ఎన్జీవోల సమ్మె ప్రారంభం!"

ఆదరా బాదరా పైకి లేచాడు. రెండు చెంబుల నీళ్ళు నెత్తిన బోర్లించుకొని స్నానం అయిందని పించాడు. గబగబ బయట పడ్డాడు. కడుపులో పిల్లులు గోల చేస్తుంటే హోటల్లో దూరి అంత తిన్నాడు. ఆ తరువాత నడక పరుగ్గా ఆఫీసు చేరు కొన్నాడు. అప్పటికే ఆఫీసు ముందు దొక గుంపు. చాలా ముందుగా నిలబడి ఉంది. లోనికి ఎవ్వరినీ వెళ్ళ నీయడం లేదు.

లోనికి వెళ్ళాలన్నాడు నిరంజనం.

కూడదన్నారు.

"నా ఇష్టం!" అన్నాడు నిరంజనం.

'నీ ఇష్టం నీ ఇంటి దగ్గర!" అన్నారు.

మాటా మాట పెరిగింది. పెరిగిన మాట వాదా నికి ఎదిగింది. ఎదిగిన వాదం ఒక పద్ధతికి వొదగలేదు. పద్ధతికి వొదగని వాదం పరిస్థితుల్ని తారు మారు చేసింది.

'చాలుగాని నిపరా!' అంటూ ఎవడో మూతి మీద ఒక దెబ్బ కొట్టాడు.

ఆ దెబ్బతో రెచ్చిపోయాడు నిరంజనం.

అయినా పదిమందిలో ఒక్కడు! పదిమందిలో పడిన పాము తప్పించుకోంటుంది. నిరంజనం పాము గాదు. ఒక మామూలు మనిషి. అందుకే పాసం! ప్రభుత్వం అతనికి ఆస్పత్రిలో ఒక పడక నిచ్చింది. పడకమీద పడుకొని ఇంటిని గురించి, ఇంటిలోని ఇల్లాల్ని గురించి ఆలోచిస్తున్నాడు.

ఇల్లాలికి ముందు ఇంటి యజమాని తండ్రి. ఈ వయస్సులో అతని మనస్సు ప్రజాసేవ వైపు మొగ్గింది.

ఈరోజుల్లో ప్రజాసేవ. పలుకుబడి కీర్తుల్ని సులువుగా చేరుకోవటానికి త్రోవ. కాస్త లౌక్యాన్ని అలవరచుకొంటే— సంసార సాగరాన్ని ఈదడానికి అనువైన నావ!

కానీ లక్ష్మీకరం చేపట్టినసేవ ఈకోవకు చెందినది కాదు.

ఏదో ధ్యేయం అతనిని జుట్టుపట్టి లాగితే అతడు ఇల్లిల్లు తిరిగి రైతుల్ని రెక్కబట్టి బరబరా బయ టికి లాగి ఒకచోట చేర్చాడు. అలా చేరిన రైతుల ముందు ఎన్నో రైతు సమస్యల్ని పెట్టాడు.

మేడిపట్టి లోకానికి మెతుకుపెట్టే రైతుల్ని ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ ఉందన్నాడు. ఎండనక వాననక రైతు చెమటోడ్చి పండించే పంట గిట్టుబాటు ధర కావాలన్నాడు. భూమిశిస్తు, కరెంటు ఛార్జీలు రైతుల నుండి వసూలు చేయడం నామోషి అన్నాడు. సంఘటిత శక్తితో సాధించడం రైతుజన కర్తవ్యం అన్నాడు.

'జై బోలో లక్ష్మీకరంగారికీ!' అన్నాడెవరో!

వీధి నాటకాల్లో వెనుక పాటలాగా అందరూ ఈ మాటను అందుకొన్నారు.

చెవులు చిల్లులు పడ్డాయి!

రైతులోకం బయలు దేరింది— నాయకుడు ముందు నడుస్తున్నాడు.

ఒక పల్లెనుండి ఇంకొక పల్లెకు... ఆ పల్లెనుండి మరో పల్లెకు... పరుగుల మీద ప్రయాణం— పల్లె పల్లెలో ఉపన్యాసాలు! రైతులు ఉత్తేజితులై ముందు నడుతున్నారు. రైతుసేన—వాహిని అయింది. ఆ సేనా వాహిని జిల్లా కేంద్రాన్ని చేరుకొనింది. నినాదాంతో నాలుగు వీధుల్ని ముంచెత్తింది. కడకు కలెక్టరు కార్యాలయం ముందు 'ధర్నా' చేసింది.

రైతుజన నాయకుడులక్ష్మీకరం జైల్లో పడ్డాడు. ఎండు గడ్డిలో పడిన నిప్పులాగా రాజుకొనిం దీ వార్త ఆ పల్లెల్లో!

'అబ్బ జైలు పాలయితే, కొడుకుఆస్పత్రి పరమాయెనే? అయ్యో! పాపం!'

"ఏం జేద్దాం! ఒక్కొక్కరు కడపలో కాలు బెట్టిన వేళావిశేషం. అట్లానే జరుగుతుంది."

"ఈరికే అన్నారా, నాయునా, పెద్దోళ్ళు! దొంతికి కడ వొచ్చినా, గాటికి గొడ్డొచ్చినా— ఇంటికి ఇల్లా లొచ్చినా యేళాపాళా సరిగ్గా ఉండాలని!"

తలకొక తీరుగా తలపోసుకొంటున్నారు.

అన్ని మాటలు మంజుల చెవుల్లో పడుతున్నాయి. ఆ లేత మనస్సు కుతకుత ఉడికి పోతూ ఉంది. ఆమె ఒక క్షణం నిలబడి ఆలోచించింది.

దేశంలో ఈ అస్తవ్యస్త పరిస్థితి అలముకొనక పోతే ఈ అలజడులకు తావులేదు. అలజడులే లేక పోతే ఈ అడ్డదిడ్డమైన మాటలు లేవు. ఎవరు దీనికి కారణం?

పగ్గాలు చేతబట్టిన ప్రభుత్వం!

పదవిలోనికి రాదలచిన ప్రభుత్వం— ఏవేవో నినా దాలు చేస్తుంది. ఆ నినాదాల్ని ప్రజలు నమ్ముతారు. పదవి చేజిక్కించుకోగానే ప్రజల్ని మరచిపోతారు.

పదవి సాధనానికి కారణాలు— నినాదాలు!

వీధి వాకిట నిలబడి ఆలోచిస్తూంటే ఆమె చూపు ఎదురింటి గోడమీద పడింది. అది తెల్లటి గోడ. ఆ గోడ నిండుకు నినాదాలు. ఏవేవో నినాదాలు.

ఒళ్ళు మండింది మంజులకు. కంట పడిన చీపురు కట్ట నందుకొనింది. వాటంగా తిప్పించుకొనింది. గోడ మీది నినాదాల్ని అదిమిపట్టి గీకుతూ ఉంది. ఆమె గీకుతూ చింటే అవి వస్తూనే ఉన్నాయి— ఏటిలో ఇసుకను త్రవ్వుతుంటే ఊరే నీళ్ళలా!

ఇప్పటివా ఆ నినాదాలు!

మంజుల అత్తగారు ఆ ఇంట్లో కొత్తకోడలుగా అడుగు పెట్టిన కాలం నుండి వ్రాసిన నినాదాలు.



ఫోటో — ఎమ్. శివశంకరయ్య (శ్రీశైలం)

పండుగాపబ్బాలకు ఆ ఇంటివాళ్ళుసున్నం పూస్తుంటే ఆ పూత వెన క్షేమంగా తలదాచుకొన్న నినాదాలు! గీకుతుంటే సున్నపు పొరలనుండి బయట పడుతూనే ఉన్నాయి.

"ఎదిరింటి గోడల్ని సుబ్బరం చేస్తా ఉంది. ఫరవాలేదే! మావకు దగిన కోడలే!" అని కొందరు ముసి ముసిగా అనుకొంటున్నారు.

"పిచ్చికాని పట్టలేదు కదా?" అని కొందరు సందేహంగా చూస్తున్నారు.

అటు ఇటు గమనించకుండా తన పనిలో తానుంది మంజుల!

పొరల సందుల్లో నుండి నినాదాలు బయట పడు తూంటే— ఆమె ఇంకనూ కసికసిగా గీకుతూనే ఉంది.

"అమ్మా! రాసిన వాళ్ళున్నారు. రాయించిన వాళ్ళున్నారు. సహాయపడిన వాళ్ళున్నారు. కారణ భూతులున్నారు. అందర్నీ వదిలిపెట్టి నామీద పడ్డావే?" అని ఆగోడ నిలదీసి అడిగేది నోరుంటే!

గోడలకు చెవులున్నాయని సెలవిచ్చిన మహాను భావులు నోళ్ళు లేవని చెప్పకుండా తెలివి మీరి పోయారు!

*